నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

## రూ. 5,000 ద్వితీయ బహుమతి పొందిన కథ

బస్సు దిగి బస్టాండ్ ఆవరణలో నాలుగడుగులు వేసి చుట్టూ కలియచూశాడు. పెద్ద మార్పేమీ కనిపించలేదు. అదే హడావిడి. మాటలు కేకలు బస్సుల హారన్‌లు కలగా పులగంగా శబ్దాల హోరు. ఎవరికి వారు తమ వాళ్ళను, సామాన్లను కాచుకుంటూ చూసు కుంటూ బయటికి వెళ్ళేజనం, మరో బస్సుఎక్కను మరో ప్లాట్‌ఫాం చేరుకుంటూ ఎవరి పరుగులో వారు వున్నారు. బస్సు దిగిన నారాయణ మాత్రం ఎలాంటి ఆదుర్దాలేకుండా చేతిలోని చిన్న సూట్‌కేస్‌తో నింపాదిగా మరో నాలుగడుగులు వేసి బస్టాండ్ అంతా కలియ చూశాడు. స్టాల్స్ అన్నీ యధాస్థానంలోనే వున్నాయి. కాకుంటే అమ్మే వ్యక్తులు మారారు. అదే పళ్ళ దుకాణం! అదే పుస్తకాల షాపు! అదే కూల్‌డ్రింక్స్ కార్నర్! అదే ఫలహారశాల. దానికి ముందు కాఫీ టీ అమ్మే అయ్యర్. అన్ని షాపుల్లో వ్యక్తులు మారినా అయ్యర్ మాత్రం మారలేదు. నారాయణ అక్కడ ఆగి చిరకాల మిత్రుడిని చూసినట్టు అతన్నిచూసి ''ఒక టీ'' అన్నాడు. తనకతను ప్రత్యేకం... అతనికి తను కాదు. టీ అందుకుని కాస్త రుచి చూశాడు. అదే నీళ్ళ టీ! ఏ మార్పులేదు. టీ తాగాక గ్లాస్ అక్కడుంచి పది రూపాయల నోటిచ్చాడు.




# నిశ్శబ్ద సంకేతం

## వారాల కృష్ణమూర్తి

అయ్యర్ ''చిల్లర మూడు రూపాయలు ఇవ్వండి'' అన్నాడు. టీలో మార్పు లేదుగాని రేటు మూడింతలయింది. జేబులో చిల్లర వెతికి అయ్యర్‌కు ఇచ్చి తాపీగా బస్టాండ్ అణువణువూ చూపు సారించాడు. అంతా అదే పాతదనం. మరింత రొచ్చుగా అనిపించింది. ప్లాట్‌ఫాం ముందున్న పిల్లర్స్‌కు అతికించిన పోస్టర్లలో మాత్రం మార్పు కనిపించింది. ప్రతి పిల్లర్ మీద కాసింత చోటు కూడా వదలకుండా ఇంటర్ కాలేజీలు, కాన్వెంట్ స్కూల్స్, ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ల గొప్పదనాలు, ఆపరేషన్ లేకుండా మొలలు - ఫైల్స్ గ్యారంటీగా బాగు చేయబడును అన్న నాటు వైద్యుల హామీ పత్రాలు - తప్పిపోయినపిల్లలు - ఇల్లొదిలిన ముసలివాళ్ళ ఫొటోలు - వాటికింద వాళ్ళ ఆచూకీ తెలిస్తే తెలపాల్సిన వాళ్ళ చిరునామాలు ఫోన్ నంబర్లు. బస్టాండ్ నిండా వాల్ పోస్టర్లలో 'ఇరవై సంత్సరాల ఈ ఫొటోలోని వ్యక్తి పేరు... అలియాస్... అలియాస్.... ఇతని ఆచూకీ తెలియచేసిన వారికి... లక్షల బహుమానం. మీ వివరాలు గోప్యంగా వుంచబడును' అంటూ ప్రకటనలు. ప్రతి వారం ఒక కొత్త పోస్టర్. బొమ్మలు అంకెలు మార్పు. మిగిలిన వివరాలు షరా మామూలే! ప్రయాణికులు మాత్రం వీటిని పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించదు. ఒక్కరంటే ఒక్కరు ఆ ప్రాంతం వారు నిలిచి చూచినా... పోస్టర్ చదివిన పాపాన పోయే వారు కాదు.

కాలం వేగవంతమయింది. ఆ వేగంలో జన జీవనం కూడా మార్పులకు లోనవుతోంది.

''అన్నా! జర ఈ సంచి చూస్తుండండ్రి. ఇప్పుడే వస్తా!'' అంటూ తన సమ్మతితో ఎలాంటి అవసరం లేకుండానే జర జర పరుగులాంటి నడకతో వెళ్ళిన యువతి వైపు కాస్త ఆశ్చర్యంగాను అసహనంగానూ చూశాడు. ఆమె వెళ్ళిన చోటు చూసి ''పాపం!'' అనుకుని తన అసహనానికి సిగ్గుపడ్డాడు. 'రోజులు సంవత్సరాలు దొర్లిపోతున్నా మనిషి ప్రాథమిక అవసరాలు తీరే తీరు కరువైనందుకు ఎవరిని నిందించాలి?' అనుకున్నాడు మనసులో.



అటుగా వచ్చిన మేక సంచిని చేరబోతే దాన్ని అదిలించి ఆ సంచి అందుకున్నాడు. అందులో వున్న కవర్‌ని బట్టి అది ఎక్సరే అని అర్థమయింది. తీసి చూద్దామా అనిపించింది. సభ్యతగాదని ఆగి పోయాడు.

ఆ యువతి నింపాదిగా వచ్చి ''థాంక్స్ సారూ. మీరెవరో... మీ బస్సు గిట్ల రాలేదు గదా!'' అంది.

చిన్నగా నవ్వి లేదన్నట్టు తల వూపాడు. ఎక్స్‌రే వున్న సంచిని ఆమెకు అందించి '' ఏ వూరమ్మా!'' అని అడిగాడు.

''ధర్మపురి!''

ఊరి పేరు వినగానే పులకింతా, ఆనందం కలిగాయి. మరింత ఆసక్తిగా ''ధర్మపురి... ఎవరి తాలూకు'' అడిగాడు.

వివరాలు చెప్పడం ఇష్టం లేనట్టు వినబడనట్టు వుంది. కాస్సేపాగి.. ''మీకు ధర్మపురి తెలుసా!'' అడిగింది.

''ఆ!''

''మీ వాళ్ళెవరున్నారక్కడ?''

సమాధానం చెప్పలేని సందిగ్ధంలో నారాయణ.

''చూశారా నన్ను అడిగారు. మీరు సమాధానం చెప్పరు''.

''గడుసు దానివే! ఏం చేస్తుంటావమ్మా!''

''బతకను ఏదో ఒకటి చెయ్యాల. ఏమీ చేతనైతలేదని వూరకే ఎట్లుంటాం! మరి నీది ఈ ఇలాకి కాదనిపిస్తోంది. ఆంధ్రోడి లెక్కన కొడ్తుండావ్ మాట తీరు జూస్తే. గుడికొస్తావా!''

''కాదు''.

''మరి బడి పంతులవా! శాన్రోజుల సంది బడి పంతులు అదో వస్తాడు ఇదో వస్తాడు అనబట్రి''.

''కాదు''.

''ఏందిది ఎదడిగినా కాదంటివి నువ్ చెప్పకుంటివి. ఏ దేశం ఏ వూరు సరిగా చెప్పండ్రి''

''ఈ దేశమే! ఏ వూరేంటి... అన్ని వూర్లు నావే!''

''పోనీ పేరన్నా జెప్పండ్రి!''

''పేరుదేముంది. ఇప్పుడు పేరుచెప్పినా నన్ను నువ్ పేరు పెట్టి పిలుస్తావా!'' అడిగాడు చిన్నగా నవ్వి.

''వయసులో పెద్దోడివి. పేరుతో పిలుస్తానా... అయినా నీ పేరేదయితే నాకేందిలే!'' కొంత నిరాశగా అంది.

''నీ పేరు?'' అడిగాడు నారాయణ.

నవ్వింది... ఆ నవ్వులో స్వచ్ఛత... అమాయకత్వం తెలివి తేటలు అన్నీ వున్నాయి.

''ఏంది రాజమ్మా! ఈడున్నావ్... ఎప్పుడొస్తివి... ఏపని మీదొస్తివి. అప్పుడే పోతుండావా... రాజవ్వ బాగున్నదా! అమ్మ ఎట్లుంది. ఈడదాక వచ్చిందానివి, ఇంటికి రాకుండా బోతున్నావా, పదా ఇంటికి పోదాం!'' అంటూ పలకరించాడు నడివయసు అతను.

''పొద్దునొస్తి మామా! అమ్మకు కడుపు నొప్పి తగ్గత లేదు. పోయిన వారం డాక్టరు కాడికి తోలుకొచ్చిన. అప్పుడు పొటోతీసిండు. ఇంకా రక్తపరీ చ్చలు చేసి ఈ వారం రమ్మన్నాడు''

''ఏమన్నాడు డాట్రు''.

''ఇయన్నీ మామూలేలే... మందులు వాడమన్నాడు. ఇంతకూ అత్త ఎట్లున్నది... శీనుగాడు దుబాయి నుండి ఫోను గిట్ల చేస్తున్నాడా!'' పరామర్శించింది.

''ఏం జేసుడో... వాడేడున్నాడో... ఎట్లున్నాడో తెల్వదు. పైసలు మిత్తికి తెచ్చి పెడితి. వీడేమో పోయిన సంది పోనూ లేదు.... జాబూ లేదు. అదేమన్నా కరీంనగరా... నిజాంబాదా ఎవరో ఒకరు వస్తారని వాడి గురించి తెలుస్తుందనుకోను. వాడెక్క డున్నాడో... ఏం తింటున్నాడో... ఏడ పండుతున్నాడో...'' అతని కడుపులో బాధ కళ్ళల్లో కనిపించింది.

''ఫికర్ గాకే... వాడొస్తాడు. ఫోనొస్తుంది లే..''

''వాడిని రోజూ యాదికి తెస్తు గా షావుకారు కన

పడ్డాడు. వాడి అప్పు కనపడ్తది. అదెట్ల మరుస్తు. కంటికి కునుకు లేదు...'' కాస్త తెరిపి తీసుకుని... ''పద బిడ్డా ఇంటికి పోదాం!'' అన్నాడు.

''మరో పాలొస్తాలే మామ!''

''ఈయనెవరు?''

''మా వూరే లే!''

''గట్లనా! మరి నేవస్తా బిడ్డా! దుకానంకు పోవాలె. ఆలీసం అయితే షావుకారు గునుస్తాడు. అడ్డదారని బస్టాండ్‌లో దూరిన... సారూ మా అమ్మిని ఇంటిదాకా దింపు సారూ!'' అంటూ శలవు తీసుకున్నాడు.

''పాపం... కొడుకుని అప్పుచేసి దుబాయి పంపాడు. వాడి అయిపు జాడ లేదు''.

''ఏం చదువుకున్నాడు?''

''చదువా... ఇంటర్... అక్కడి ఒక సేట్ దుకానంలో లెక్కలు రాయను పంపుతానని ఏజంట్ లక్ష న్నర తీసుకున్నాడు''.

''అత్తెసర చదువులతో దుబాయిలో ఏం చేస్తారు. కూలీలుగా బతకాలి. అదీ నికృష్టంగా. కూలీలుగా వెళ్ళే వాళ్ళకు అది ఎండమావి. పరుగే తప్ప దాహం తీరదు. అక్కడ వున్న వాళ్ళకు – ఇక్కడ వాళ్ళకు కన్నవాళ్ళకు బాధే! ఎవరతను?''

''మా అమ్మ పెద్దమ్మ కొడుకు''.

ఆ తరువాత ఇద్దరి మధ్యా మాటలు కరువై కాలం బరువుగా సాగింది. ఆ బరువును తేలిక చేస్తూ ''అన్నా బస్సు ఎప్పుడొస్తుందో కనుక్కోస్తా!'' అంటూ లేవబోయింది.

''నువ్ ఎందుకమ్మా! నేను కనుక్కొస్తా... నువ్వలా కూర్చో...'' అంటూ తన చేతిలోని సూట్ కేస్ ఓ పిల్లర్ అరుగుమీద పెట్టి ఆమె కూర్చున్నాక ఎంక్వయిరీ కౌంటర్ వైపు వెళ్ళాడు.

ఆవరణ ప్రయాణికులతోనేగాక చుట్టుపక్కల వూర్లలోని పిల్లలు అక్కడ చదవను వచ్చి కాలేజీ లేక కొందరు, పోక కొందరు కొలువు దీరారు. ఆ బస్టాండ్ వాళ్ళకు విశ్రాంతి మందిరమైంది. పుస్తకాల బ్యాగ్‌లు తగిలించుకుని ఆ ప్రాంతమంతా అల్లరి చిల్లరగా తిరుగుతున్నారు. అమ్మాయిలు మాత్రం కాస్త బుద్ధిగా అనువుగా వున్నచోట చూసుకుని గల గలా మాటలతో కాలాన్ని మరుస్తున్నారు.

''రాజమ్మా... ఇప్పట్లో బస్సు రాదంటమ్మా! మధ్యాహ్నం రెండు తర్వాతేనంట. ఏం చేద్దాం!''

''చేసుడిదేముంది. కాసుక్కుపోవడమే. మీకే మన్నా పనులుంటే ఎల్లండి. మీ సూట్ కేసు నే జూస్తుండ''.

''ఇక్కడ నాకు పన్లేమిటమ్మా!'' అంటూ కూర్చుని ''రాజమ్మా!'' అని ఏదో అడగ బోయాడు.

''నా పేరు రాజేశ్వరి! అయిన వాల్లు రాజమ్మని అంటారు.''

''నేను కూడా అయినవాడినే అనుకోమ్మా! ఇప్పుడు చెప్పు టిఫిన్ ఏదైనా తింటావా... లేక కాఫీ... టీ లాంటిదేమైనా తెమ్మంటావా!''

''అబ్బే వద్దన్నా... ఇంతకు ముందే డాక్టర్ ఇంట్లో తినొచ్చాను''.

''డాక్టర్లు వచ్చిన వాళ్ళకు టిఫిన్లు కాఫీ టీలు ఇస్తారా!''

''మా డాక్టర్ సారు ఇస్తాడు''.

''చాలా మంచివాడులా వున్నాడు''.

''అవును చాన మంచోడు. చిన్నచిన్న జబ్బులకు మందులు కూడా వూరకే ఇస్తాడు'' కళ్ళతో కృతజ్ఞ తలు తెలిపింది.

''ఇంతకూ అమ్మకు ఏమయింది?''

ఆ ప్రశ్నతో రాజమ్మ ముఖంలో అంతవరకు లేని విషాద ఛాయలు అలుముకున్నాయి. మూగగా మనసులో మదనపడింది.

''ముక్కు మొహం తెలీనవాడికి ఈ సంగతులెం దుకు... అని అనుకోకు. చెబితే... నేను చేయ తగ్గ సాయం అయితే తప్పక చేస్తాను. చేసే వీలు లేక పోతే పని జరిగే మార్గమన్నా చెబుతాను...''

''అమ్మకు కాన్సర్!'' జీరబోయిన స్వరం చుట్టూ వున్న శబ్దాలను బద్దలు చేస్తూ అతని చెవులకు సోకింది.

''ఏ స్టేజిలో వుంది... ఆ రిపోర్ట్స్ ఇవ్వు...'' అదు ర్దాగా ఆమె సంచిని తీసుకుని అందులోని ఎక్సరే రిపోర్టు... బ్లడ్ రిపోర్టు చూసి తిరిగి సంచిలో పెట్టి రాజమ్మ కందించి'' ''కంగారు పడకు. ఇప్పుడు మంచి మందులొచ్చాయి'' అన్నాడు.

రాజమ్మ కనుకొలికిల్లో దిగులు వూట వూరుకొ స్తోంది. హృదయ భారాన్ని మొహం అటు తిప్పు కుంటూ చీర చెంగులో అద్దుకుంది.

జల జీవం లేని నదిలా మిగిలింది. రంగు వెలి సిన బొమ్మలా వుంది.

''రాజమ్మా! బాధ పడకు... మీ నాన్న ఏం చేస్తుం టాడు''.

అంతవరకు మనసులోనే నలుగుతూ సుడులు తిరుగుతున్న బాధ గట్టు తెగిన వరదయింది. మోకాళ్ళ మీద తలవాల్చి మౌనంగా ఏడ్చింది. అలా ఓ అయిదు నిమిషాల రోదనకు అడ్డుకట్ట వేసి తల ఎత్తింది. కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. పీలుస్తున్న గాలి విడుస్తున్న గాలి అదుపుతప్పి బుసబుస మంటున్నాయి. ఎగపోసలు దిగపోసలు ఆగను మరో అయిదు నిమిషాలు పట్టింది.

''నాన్న లేడా!''

''లేడన్నానా!'' తక్షణ స్వరం.

''ఏం చేస్తుంటాడు?'' నిశ్శబ్దమే సమాధానంలా వుంది. ''చెప్పడం ఇష్టం లేకపోతే వద్దులే అమ్మా! ఎందుకడిగాను అంటే ఈ జబ్బు మనలాంటి వాళ్ళకు రా తగ్గది కాదు. వైద్యం ఖరీదైంది.... అందు కని'' ఎందకడిగాడో వివరించాడు ''పోనీ ... నువ్వేం చేస్తుంటావ్..'' మరో ప్రశ్న వేశాడు.

ఇద్దరి మధ్యా భయంకర నిశ్శబ్దం.

నిశ్శబ్దంలో బద్దలవుతున్న జీవిత శకలాలు. ఇంతవరకు ఎవరి ముందు వెళ్ళబోసుకోని స్మృతులు ఎగదన్ను కొస్తున్నాయి రాజమ్మలో.

''చెప్పమ్మా! ఏమిటి నీ బాధ''.

''ఒక్క ముక్కలో చెప్పేది కాదన్నా... ఎంత చెప్పినా తీరేది కాదు''.

హృదయం బరువెక్కినప్పుడే నీటిలో పడ్డ వస్తువు బరువు కోల్పోయిన మేర నీరు తొలగినట్టు భరించలేని నిజాలు బయట పడతాయి. సమయం మించితే కలవరం కడుపులోనే ఇమిడిపోవచ్చు అను కుంటూ ''చెప్పమ్మా... చెప్పు'' బ్రతిమాలుతున్నట్టు అడిగాడు.

రాజమ్మ చెప్పడం ప్రారంభించింది.

''నాకు బుద్ధి తెలిసే నాటికి నేను అమ్మను రాజ వ్వను మాత్రమే జూసిన్ను. రాజవ్వ మా నాయన అమ్మ. మా నాయన లేని లోటు లేకుండా మా రాజవ్వ నన్ను జూసుకునేడిది. మా అమ్మ మాత్రం అప్పట్లో రోజూ నాన్నను యాద్ జేసుకునేడిది. మనసు చెడి మా నాన్నను రాజవ్వను తిట్టేది. రాజవ్వ తన్ను తిట్టినా భరించేది గాని నాన్నను తిడితే తిరిగి తిట్టేది. వారానికోసారి ఈ లొల్లితో ఇల్లంతా చెల్లా చెదురయ్యేది. శాస్త్రోజులు దాకా వాల్లి ద్దరూ ఎందుకలా తిట్టుకుంటారో తెలిసేది కాదు. తెలిసిందల్లా నాన్న కోసమే ఇద్దరి గోస అది.



రెండులోనో మూడో తరగతిలోనో మా వూర్లోని బడి దోస్త్ సర్పంచి కూతురితో వాళ్ళింటికి పోయిన్ను. నేనంటే ఆ పిల్లకు శానా ఇది. తనేం తినడానికి తెచ్చుకున్నా సగం నాకు పెట్టేది. అది రమ్మంటేనే వాల్లింటికి పోయిన్ను. ఇద్దరం కలిసి ఆడుకుంటున్నాం. వాల్ల నాన్న వచ్చాడు. తెచ్చిన మిఠాయిలు దాని చేతిలో పెట్టాడు. అది సగం నాకిచ్చింది.

"ఎవరీ పోరి?" వాళ్ళ నాన్న అడిగాడు.

"రాజేశ్వరి... నా దోస్త్..."

"యాడుంటారు... మీ నాయన పేరేందే.."

"నాయన కాదు. అమ్మ... రాజవ్వ..."

"యాడ మీ ఇల్లు"

చెప్పిన.

వాల్ల నాన్నతో వచ్చినవాడు "దొర ఇదిగా అన్నల్లో కల్సినాడే వాడి కూతురు" అన్నాడు.

"మన పిల్లదానికి బుద్ధి లేదు. ఇసంటోల్లతో దోస్తానా చేస్తారా! ఎయ్... నీ ఇంటికి పో... తేరగ వచ్చి మా పిల్లల్తో వుండి. మా ఇల్లల్లో తిరిగి... తిని మా మీదే తిరగబడతారు.. మీ జాతే అంత. పో..."

చేతిలో వున్న మిఠాయిని నేలకేసి కొట్టి ఇంటికి వురికినా. ఇంటి ముందు నులక మంచంలో కూసునుంది అవ్వ. పొయ్యిలో కట్టె పుల్లలు ఇరిసి పెడతా వుంది అమ్మ.

"అమ్మా! చెప్పు నాన్న ఏడే!" అని అడిగినాను.

"ఇదీ... అడుగుతోంది. చెప్పు జవాబు" మా అమ్మకు సాకు దొరికింది నాన్నను తిట్టను.

"చిన్నది అది తెలిసో తెలీకో అడిగితే దానికి ఏదో జెప్పాలె. దానికి గింత గొంతు చించుకుని నా మీదకు రావాలా... సందు దొరికితే ఒంటికాలి మీద లేసుడు. నీతో యాగ లేకే వాడు ఇల్లొదిలి పోయిండు".

"పెళ్లాం పిల్లల్ని గాలికొదిలి లోకాన్ని వుద్దరిస్తాడంటే ఎవలు నమ్ముతారు. లోకాలు పట్టి తిరగనేనా పెల్లి సేసుకుంది" దండకం అందుకుంది అమ్మ.

వారానికో పది రోజులకో జరిగే రగడే ఆ రోజు నా వల్ల.

అమ్మ అక్క సేందో – అవ్వ మనసేందో – నాన్న ఎటు పోయినాడో తెలియని రోజులు. నాన్నను ఎంత మరచిపోదామన్నా రోజూ ఎవరో ఒకరు యాదికి తెస్తూనే వుంటారు. వూరు మొత్తం, రెండు లేదా మూడిల్లు తప్ప అందరికీ మేమంటే శాన ఇది. మమ్మల్ని కడుపులో పెట్టుక చూస్తారు. మగసాయం లేకుండా ఒంటిగా ఇంతకాలం గడపడం సామాన్యమా!

"ఇంక చదువు మాన్నై ఎవరిస్తారు పైసలు. హైస్కూలు లేదు గైస్కూలు లేదు" అమ్మ కసుర్లు.

అవ్వ బతిమాలినా లాభం లేక పోయింది. పది రోజుల తరువాత రామం సారు ఇంటికి వచ్చాడు.

"పిల్ల బడి మానిపిస్తే ఎట్లాగమ్మా!"

"సదువులు పేదోల్లకు ఎట్లొస్తాయి. పైసలు కావద్దా!"

"ఏం పైసలు. గవర్నమెంటు స్కూలు. ఫీజులు పుస్తకాలు నేను చూసుకుంటాను. పిల్లను బడికి పంపించు".

## కథకు కుల మతాల రంగులొద్దు



నా కథ 'నిశ్శబ్ద సంకేతం'కు బహుమతినిచ్చి గౌరవించిన న్యాయ నిర్ణేతలకు నా కృతజ్ఞతలు.

1.7.1950లో వాల్మీకి పురం (వాయల్పాడు) చిత్తూరు జిల్లాలో పుట్టాను. అప్ప హనుమంతయ్య, అమ్మ సుబ్బమ్మ. చదివింది బి.ఎ. సీనియర్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎ.జి. ఆఫీసు హైదరాబాదులో ఉద్యోగం. శ్రీమతి పేరు రాధ. పిల్లలు భారతి, ఉష, భరత్.

శ్రీశ్రీ కవిత్వం, కాళీపట్నం రామారావు కథలు సాహితీ జగత్తులో మార్గదర్శకులుగా భావిస్తాను.

కథా నేపథ్యానికి తగ్గ భాష, యాస కథకు వన్నె తెస్తుందని నమ్ముతాను. సమస్య ఎక్కడిదయితే ఆ యాస రాయడానికి ప్రయత్నిస్తుంటాను. ఇప్పటివరకు వంద కథలు, ఒక నవల ఆరు నాటికలు రెండు నాటకాలు రాశాను. చివరగా కథకు ప్రాంతం, కులం, మతం రంగులు వద్దు. కథను కథగానే చూద్దాం. అందులోని జీవితాల్ని చూద్దాం. వందేళ్ళ తెలుగు కథను సుసంపన్నం చేసుకుందాం.

***–వారాల కృష్ణమూర్తి***
***ప్లాట్ నంబర్ 657,***
***శ్రీకృష్ణ దేవరాయనగర్, వనస్థలిపురం***
***హైదరాబాదు – 500 070***
***ఫోన్: 040 – 24240998***

"నాతో పాటు కూలికి తీసుకు పోదామనకుంటే నువ్ స్కూలంటే ఎట్ల సారూ, పిచ్చి సారులా వున్నావ్ సరే కానీ"

సారు దయవల్ల చదువు కొనసాగింది. ఒక్కో క్లాసు దాటుతున్న కొద్దీ నాన్న గురించి తెలియడం మొదలు పెట్టింది.

పాలు పోసే గంగ, కూరలమ్మే సాయిబు సామాన్ల కోమటి ఎప్పుడూ డబ్బులకు తొందరపెట్ట లేదు. పంచాయితీ ఆఫీసులో గాని మరే ఇతర ఆఫీసుల్లో గాని క్యాస్టు సర్టిఫికెట్‌కో ఇన్‌కం సర్టిఫికెట్‌కో పోతే అంతా క్షణాల్లో పనులు జరిగేవి. ఎందుకు జరుగుతున్నాయి. ఇతరులకు లేని సౌలత్ దక్కేది.

అది నాన్న లేడని కాదు.

నాన్న వున్నాడని... కనిపించని కొండంత అండ మాకుందనిపించింది. మొదటిసారి నాన్న పట్ల వున్న ద్వేషం... ఉదాసీనత పోయి గౌరవం కలిగింది.

నాన్న దొంగ కాదు.

జనం కోసం నిలబడ్డాడు.

మెల్లగా అర్థమవసాగింది. చాలమంది కళ్ళలోని ఆరాధనా భావం... దాని వెనక నాన్న త్యాగం.

మా అవ్వా అదే అనేది, వాడు కనిపించకున్నా వున్నట్టే అని. నాన్న గురించి గొప్పలు చెప్పేది. అమ్మ చెవిన పడకుండా. మా అమ్మ రుసరుసలు మాత్రం ఆగేది కాదు. ఒక రకంగా మా అమ్మ గోడులో నిజముంది. జీవితమంతా ఎదురు చూపులే! బండ బారిపోయింది.

కొండ మీద ఎంత వాన కురిసినా జారిపోతుంది. మోడు బారిన అమ్మమనసులో నాన్న పూసులూ జారిపోయాయి. "కట్టెలా కనిపిస్తుంది. దాని మనసూ కట్టే ఎన్నడూ కట్టుదాటలా... దాని మొగున్ని అది తిట్టక ఎవరు తిడతారు" అంటూ మెచ్చుకునేది అవ్వ.

అప్పుడెప్పుడో ఒకసారి ఒక మనిషొచ్చి "అన్న కరీంనగర్‌ల పలాన లాడ్జిలో వున్నాడు. నిన్ను రమ్మన్నాడు" అంటే అంతెత్తున లేచింది. "బజారుముండనా లాడ్జిలెంట తిరగను. అంత వుండలేనోడు ఎందుకెల్లాలి. అవ్వా కావాల బువ్వా కావాలంటే కుదర్దని చెప్పు. ఇంకెప్పుడూ ఇట్లాంటివి మోసుకు రాకు" అని తరిమినంత పని చేసింది.

"పాగల్ ముండ జిందగీ ఎట్లా గుజారిస్తుందో" అని ఆ రోజంతా అవ్వ నిద్రపోలా.

ఇంటర్ పూర్తయింది. బి.ఎ. ఓపన్ యూనివర్సిటీలో చేశాను.

ఉద్యోగ ప్రయత్నాలు మొదలు. అనుకోకుండా హోం గార్డుగా సెలక్ట్ అయ్యా. ఆరు నెలలు హాయిగా గడిచింది. ఆ తరువాత మళ్ళీ మొదలు కష్టాలు.

"మీ నాన్నను మనం బాధ్యత గల పోలీసులుగా పట్టుకోవాలా లేదా.." అంటూ అగాడు దొర.

"మట్టుబెట్టాలి అంతేనా సార్".

"అబ్బేకాదు. జన జీవన స్రవంతిలోనికి వచ్చేయమని నువ్వూ.... మీ అమ్మ.... మీ అవ్వ ఓ ప్రకటన ఇవ్వాలి. ఆయన సరెండర్ అయితే ఆయన మీదున్న అయిదు లక్షల రివార్డు ఆయనకే ఇస్తాం. ఇంకా పొలం... బ్యాంకు ద్వారా లోన్లు అన్నిటినీ మించి నీకు పర్మనెంట్ ఉద్యోగం" చాటంత మొహంతో వెలిగిపోతూ అన్నాడు పోలీసుదొర.

"మా అమ్మ ముందు తీశారు గదా ఈ ముచ్చట ఏమంది?"

"ఆc..... అబ్బో అగ్గిరాముడు... కాదుకాదు నిప్పుల రాణిలా భగ్గుమంది. 'నన్నొదిలి పోయినోడిని... నేను 'రారా...' నన్నేలుకోరా...! అని మొరపెట్టుకోనా అదీ ఈ వయసులో. సిగ్గుండాల. మీరు అయిదు కాదు పది లక్షలిచ్చినా వాడొద్దు" అంటూ నాగుపాములా బుసలు కొట్టింది.

"నేనూ అంతే" అన్నాను. అంతే! చెప్పుకోలేని కష్టాలు. వుద్యోగం పోయింది. ప్రస్తుతం ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా నెట్టుకొస్తున్నాను".

ప్రవాహంలా సాగింది ఆమె వ్యధ.

ధర్మపురి బస్సు ఆలస్యాన్ని కప్పి పుచ్చుకోను అన్నట్టు 'బయ్' మని హారన్ మోగిస్తూ వచ్చి ఆగింది. బస్సు దిగిన డ్రైవర్ కండక్టర్లు క్యాంటిన్ వైపు నడిచారు. బస్సులో జనం అట్టే లేరు. ఎక్కే జనం రద్దీ కూడా లేదు.

రాజమ్మ ముందు ఎక్కింది. టూ సీటర్‌లో కూర్చుని "అన్నా ఇటురా" అని పిలిచింది. నారాయణ తన సూట్‌కేసు సీటులో పెట్టి "ఇప్పుడే వస్తా" అంటూ దిగి వెళ్ళాడు.

కాస్సేపటికి అరడజన్ ఆపిల్ పళ్ళు, రెండు దానిమ్మలు, ఒక నీళ్ళ బాటిల్‌తో వచ్చి రాజమ్మకు అందించాడు.

"బైటకు పోయినట్టున్నావ్. ఈ వూరు తెలుసా అన్నా".

నవ్వాడు నారాయణ.

"అన్నిటికీ నవ్వుతున్నావ్ నీ సంగతే చెప్పవు!" అంది నిష్ఠూరంగా.

సీటులో కూర్చుంటూ "చెప్పడానికేముందమ్మా! సాదా సీదా మనిషిని" అన్నాడు.

కండక్టర్ డ్రైవర్ వచ్చారు. జనం బస్సెక్కారు. బస్సు కదిలింది. కండక్టర్ "టికెట్... టికెట్"... అంటూ వచ్చాడు.

"ధర్మపురి రెండు"

"అన్నా" అంది వారిస్తున్నట్టు.

"అదేమిటమ్మా ఆ మాత్రం టికెట్ తీసుకోకూడదా"

"గట్లయితే నేనే తీసుకుంటా మీకు"

"వద్దులే అమ్మా! ఎవరిది వాళ్ళం తీసుకుందాం!"

రాజమ్మ నవ్వి తన టికెట్ డబ్బులు ఇచ్చింది. కండక్టర్ రెండు టికెట్లు రాజమ్మ చేతిలో పెట్టి ముందుకు కదిలాడు. బస్సు వూరు వదిలింది. చల్లటిగాలి అలసిన మనసులకు కాస్త వూరటగా వుంది.

"రాజమ్మా" ఆత్మీయంగా పిలిచాడు.

"అన్నా"

"ఒక మాట అడుగుతా మనసులో దాచుకోకుండా నిజం చెప్పాల"

"అడగన్నా"

"మీ నాన్న తిరిగొస్తే ఎలా వుంటుంది"

"పగటి కలలు కనను"

"ఒక వేళ వస్తే"

"రాడు"

"అమ్మకు ఆరోగ్యం సరిగాలేదు. అవ్వకు వయసు మీద పడింది. నీవింకా జీవితంలో స్థిరపడలేదు. ఇలాంటి పరిస్థితిలో మీకు అండగా ఒక ఆసరాగా వుంటుంది. మీ నాన్న తిరిగొస్తే"


ఊహించని ఆలోచనకు చకితురాలై అతన్ని తీక్షణంగా చూసింది. ఆ తీక్షణ చూపుల్ని చూడలేక "జన జీవన స్రవంతిలోనికి వస్తే..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"అంత పెద్దమాటలొద్దన్నా... లొంగిపోతే అనండి. ఏమవుతుంది. అమ్మరోగం పోతుందా.... అవ్వ కడుపు సల్లబడుతుందా? నాకేమైనా లంకెబిందెలు దొరుకు తాయా... అలా వచ్చినవాళ్ళు. ఏం బావుకున్నారు. ఇంతవరకు గొప్పగా ఆరాధించిన వాళ్ళు అసహ్యించుకుంటారు. ఎవ్వరూ చెయ్యలేనిది తన కొడుకు చేసినందుకు ఎంతో పొంగి పోతోంది మా అవ్వ. ఆమె తృప్తిని లాగేసుకోనా వచ్చేది.

పెళ్ళయిన కొత్తలో ఎలావుందో ఏమో రెండేండ్లు తిరక్కుండా కడుపుతో వున్న పెళ్ళాన్ని వదిలిపాయె. అడవిలో చెట్టులా – కొండమీద గుండులా ఇన్నాళ్లూ బతికిన అమ్మ జీవితంలో ఏ వసంతాలు నింపను రావాలిప్పుడు.

కడుపులో వుండగానే ఎల్లిపాయె. ఇన్నాళ్లూ పడీలేసి నిలబడ్డా. బాల్యం కరిగిపోయింది. బరువు బతుకు ఇరవై ఏళ్లుగా ఈడుస్తున్నా... ఎప్పుడూ నాన్న వుంటే? అనుకోలే.

బతుకులోని లోతును చూశాను. కష్టాల కొలిమిలో రాటు దేలాను. బతుకులో ఎట్లా నెగ్గుకు రావాలో తెలిసింది. ఇంక ఎవరితోడూ అక్కర్లా బతుకులో పోరను.




మా మనస్సుల్లో ఉన్నతంగా వున్న నాన్నను చెరిపేసుకోలేము. ఆ ఆలోచన తేవద్దు".

ఆ తరువాత ఇద్దరి మధ్యా మాటలు లేవు. అంతరాల్లో... తరాల్లో వున్న తేడా ఇద్దర్నీ ఓ పది నిమిషాలు నిశ్శేష్టుల్ని చేసింది.

"ఏమీ అనుకోకమ్మా! ఏదో వూరకే అన్నాను"

"అన్నా నువ్ ఎవరో చెప్పవా! నా కథంతా చెప్పించావ్ నువ్ విలేఖరివా ... లేక రచయితవా"

"రెండు కాదు.."

"మరెవరు"

"చెబుతాను కానీ నాకో మాట ఇవ్వాలి. నే చెప్పినట్టు వింటానంటే"

"అలవిగానిదైతే విన్ను..."

సూట్‌కేస్ అందుకుని ఓపన్ చేసి బట్టల చివర నోట్ల కట్ట తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"ఎందుకన్నా డబ్బు"

"అమ్మ వైద్యానికి అవసరం"

"వద్దన్న... బతికినన్ని రోజులు బతుకుతుంది. మాకు జీవితంలో పోరాటం కొత్తగాదు" అంటూ తిరిగిచ్చింది.

అతని కళ్ళల్లో నీళ్ళు.

"అన్నా ఏందిది కళ్ళల్లో నీళ్ళు" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్ ఓడిపోనందుకు ఆనందం"

ఆ తరువాత ఇద్దరి మధ్యా మాటలు లేవు. నారాయణ ముందు సీటుకు తల ఆనించి మనసులోని బరువును దించుకుంటున్నాడు. రాజమ్మ రోడ్డు వారగా కదిలిపోతున్న ప్రకృతి చిత్రాలను చూస్తూ గతాన్ని మరుస్తోంది. బస్సు వేగం తగ్గింది.

నారాయణ నీళ్ళ బాటిల్, సూట్ కేసు తీసుకుని లేచాడు.

"అన్నా ధర్మపురి దాంక వస్తనంటివి".

రాజమ్మ ప్రశ్నకు సమాధానంగా నవ్వి ముందుకు కదిలాడు. బస్సు ఆగింది. బస్సు దిగి రాజమ్మ వున్న సీటువైపు వచ్చాడు.

"వస్తానమ్మా"

"అన్నా పళ్ళ సంచి మరిస్తివి" అంటూ కారీబాగ్ అందించింది.

అందులోంచి ఒక్క ఆపిల్ తీసుకుని ఆ బాగ్ తిరిగి ఆమెకు ఇచ్చి "ఇది తిరిగిచ్చి అవమానించకమ్మా!" అన్నాడు ఆత్మీయంగా. రాజమ్మ మారు మాటలేకుండా అందుకుంది.

నిశ్శబ్దానికి అటూ ఇటూ నలుగుతున్నారిద్దరూ.

"సొంత మనిషి లెక్కన నాగోడింటివి. అర్థాంతరంగా దిగి పోతున్నావ్. కొంచం కూడా సమజైత లేదు" అంది అభిమానంగా.

బస్సు కదిలింది. వేగం పుంజుకొంది. నారాయణ రాజమ్మనే చూస్తూ చెయ్యి వూపుతున్నాడు.

రాజమ్మ కాక బస్సు మాత్రమే కనిపిస్తోంది. వేగంలో బస్సు దూరమైంది చూపుకు.

గతం వర్తమానాల ఘర్షణలో నలిగిన నారాయణ తేరుకుని రోడ్డుకు అటు వైపు చేరాడు.

*